# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## ఫొటో గ్రఫీ-షార్ట్ ఫిలిం పోటీలకు ఆహ్వానం ఎస్పీ

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని రాష్ట్ర పోలీసు ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యార్థులకు, యువతకు. ఔత్సహిక ఫోటో గ్రాఫర్లకు ఫోటో గ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రమణకుమార్ పేర్కొన్నారు. ఫోటో గ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు సంబంధించి రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూడ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవలకు సంబంధించిన ఫోటోలు, షార్ట్ ఫిలిం అయి ఉండాలన్నారు. గత సంవత్సరం 21 అక్టోబరు 2021 నుంచి ఇప్పటి వరకు తీసిన ఫోటోలు నాలుగు, షార్ట్ ఫిలిమ్‌లను పెన్ డ్రైవ్‌లో కాని, సిడి రూపంలో కాని తమ పూర్తి వివరాలను పేర్కొంటూ ఈ నెల 22వ తేదీ లోపు సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పిఆర్ఓ సెక్షన్‌లో అందేలా చూడాలన్నారు. దరఖాస్తులను పరి శీలించి అందులో మెరుగైన ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందచేయడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పి కోరారు.

## ఏడుపాయల వనదుర్గా భవాని హుండీ లెక్కింపు

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:** స్వయంభూవు వనదుర్గా భవాని మాత ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. 90 రోజుల పాటు ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా చెల్లించుకున్న నగదును అధికారులు లెక్కించగా 31లక్షల 20వేల 720 రూపాయలను భక్తులు సమర్పించుకున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ బాలాగౌడ్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు, ఆలయ ఇఓ సార శ్రీనివాస్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఆవరణలోని గోకుల్ షెడ్‌లో శ్రీ భ్రమరాంభిక సేవా సమితి సభ్యులు సునీతరెడ్డి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. సీసీ కెమెరాలు, పోలీసుల నిఘా మధ్యలో హుండీని లెక్కించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు వెంకటేశం, నాగభూషణం, మనోహర్, పెంటయ్య, యాదయ్య, బాగారెడ్డి, సాయిలు, మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, చక్రపాణి, శ్రీ భ్రమరాంభిక సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, లక్ష్మీనారాయణ, నాయికోటి రవి, మహేష్, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ భవన్‌లో ఓటు హక్కులను వినియోగించుకుంటున్న టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, టిపిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతి నిధి హరికృష్ణ, నియోజవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి సోమవారం హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన ఎన్నికలో సిద్ది పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం ఆయన పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి నేటీ వరకు అధికారంలో ఉన్న బిజెపి సర్కారు దేశాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. మతం పేరిట ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడమే పనిగా పెట్టుకుందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ప్రజాస్వామ్యం బతకాలంటే చేతి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకున్న : హరికృష్ణ

సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన టిపిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతి నిధి పూజల హరికృష్ణ ఎఐసిసి అధ్యక్ష పదవి కోసం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన ఎన్నికలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### గాంధీ భవన్‌లో ఓటేసిన నియోజవర్గ ఇంచార్జి కాట శ్రీనివా స్‌గౌడ్

**పటాన్‌చెరువు, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఏఐసిసి అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలను పురష్కరించుకుని పటాన్‌చెరువు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివా స్ గౌడ్ తన ఓటును సద్వినియోగం చేసుకున్నారు. సోమవారం హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో తన ఓటును సద్వినియోగం చేసుకున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఏఐసిసి అధ్యక్షునిగా ఎన్నికైయ్యాక దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం తథ్యమని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

## టిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ నాయకులకు ఖండువాలు వేసి పార్టీలో ఆహ్వానిస్తున్న చింత ప్రభాకర్

**కంది, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని బేగంపేట గ్రామా నికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువకులు సోమవారం టీఆర్ఎస్‌లో చేరారు. టిఆర్ఎస్‌లో చేరిన యువకులను టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్ టిఆర్ఎస్ ఖండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. టిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులపై టిఆర్ఎస్‌లో గ్రామా నికి చెందిన 50మంది యువకులు పార్టీలో చేరినట్లు చింత ప్రభాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, నాయకులు సాయిగౌడ్, ఆత్మ కమిటి చైర్మన్ కృష్ణగౌడ్, మోహన్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, మాజీ సర్పం చ్ శ్రీని వాస్‌గౌడ్, గ్రామ కమిటి అధ్యక్షులు వేణు గౌడ్, ఎల్లాగౌడ్, ఎంకటేశ్‌గౌడ్, శ్రీకాం త్‌నాయక్, వార్డు సభ్యులు రమేష్, శేఖర్, శివ గౌడ్, తరుణ్, బంటు, సతీష్, సత్తి పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా క్రీడాకారులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీలో గత మూడు రోజులుగా జరిగిన టెన్నికాయిట్ అరవ సబ్ జూనియర్స్ (బాలబాలికలు), సీనియర్స్(మహిళా, పురుష)ల విభాగంలో ఐదుగురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సబ్ జూనియర్ బాలికల సింగిల్స్ విభాగంలో గందమల్ల హారిక(జగదేవాపూర్) బంగారు పథకం సాధించింది. బొగ్గుల స్పందన(జగదే వాపూర్) క్యాంస పథకం, బాలుర విభాగంలో గొల్లబోయిన మహేష్(ఇబ్రహీంనగర్) నాలుగవ స్థానంలో గెల్లు పవన్ 5వ స్థానంలో నిలిచారు. సీనియర్ మహిళా విభాగంలో సృజన(జగదేవాపూర్) 5వ స్థానంలో నిలిచి అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలు సీనియర్స్ హరియానలో సబ్ జూనియర్స్ బీహర్ రాష్ట్రంలో నవంబర్ నెలలో జరగనున్నాయని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్ తెలిపారు. క్రీడా జట్టుకు శిక్షకులుగా క్యాతం రాజ్‌కుమార్, అనంతరామ్‌చారీ, మేనేజర్‌గా వెంకటేష్‌లు వ్యవహారించారు. క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన సిద్దిపేట మున్సిపల్ 42వ వార్డు కౌన్సిలర్ కాటం శోభరాఘురామ్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. అలాగే జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నాగేందర్, క్రీడా హబ్ అధ్యక్షులు పాల సాయిరాం, టెన్నికాయిట్ జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మ కనకయ్య, పాతూరి సుజాత, కోశాధికారి గుండి ప్రవీణ్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బందరుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి జంగపల్లి వెంకటరమణయ్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటస్వామి, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, పుట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి అక్బర్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

### వివోఏల సమస్యలు పరిష్కరించాలి

**సంగారెడ్డి, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తామెదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వివోఏలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఇందిరా క్రాంతి పథకం ఏపిఓ బాలకృష్ణకు వివోఏలు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ వివోఏలకు కనీస వేతనం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివోఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివోఏలు మహ్మద్‌ఖాజా, సిద్దురాజు పాటిల్, శిరోజోద్దీన్, నర్సింలు, రాజపతి, విజయకుమార్, పద్మమ్మ, నాగమణి, రాజు, వసం త, సంధారాణి, అనిత, షఫియొద్దిన్, రాములు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్

# రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా అంగడికిష్టాపూర్

**పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు**
**- శాశ్వత పరిష్కారానికే గ్రామకంఠ భూముల సర్వే**
**- త్వరలోనే పట్టాల పంపిణీ**

**మర్కుక్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన అంగడికిష్టాపూర్ గ్రామకంఠ భూముల సర్వేలో రాష్ట్రానికే రోల్‌మోడల్ కానున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌లు స్పష్టం చేశారు. మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం గ్రామకంఠ భూముల సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచన మేరకు గ్రామ కంఠ భూముల శాశ్వత పరిష్కారానికై సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఆగస్టు 19న గ్రామంలో డ్రోన్ కెమెరాలతో గ్రామకంఠ భూముల సర్వేను ప్రారంభించడం జరిగిందని, పూర్తి స్థాయిలో సర్వే పూర్తయ్యిందని వివరించారు. అంగడికిష్టాపూర్‌లో 341 ఇంటి యజమానులకు సర్టిఫికెట్లను త్వరలోనే అందించనున్నట్లు తెలిపారు. మిగతా గ్రామాలకు అంగడికిష్టాపూర్‌ను ఆదర్శంగా తీసుకొని గ్రామకంఠ భూముల సర్వేను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామకంఠ భూముల సర్వే ద్వారా ప్రతి యజమానికి శాశ్వత పరిష్కారం చూపిస్తూ ఇచ్చిన పట్టా సర్టిఫికెట్‌తో బ్యాంకు ద్వారా రుణాలు పొందడంతో పాటు ఇతరత్రా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం 12 ఎకరాల భూమిని గ్రామస్తులు త్యాగం చేశారని, వారితో పాటు ఇళ్ళులేని నిరుపేదలకు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3 లక్షల నిధులను మంజూరు చేసేలా కృషి చేయాలని తెలిపారు. గ్రామంలోని 150, 158, 186 సర్వే నెంబర్లలో గల భూ సమస్యను కూడా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

### జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుకు పోటీపడాలి

అంగడికిష్టాపూర్ ప్రజలందరూ ఐక్యమత్యంతో ఉంటూ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవడంలో ముందు వరుసలో ఉన్నారని, ఉత్తమ జాతీయ గ్రామపంచాయతీ అవార్డు కోసం కూడా పోటీపడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావు సూచించారు. గ్రామంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని వివరించారు.

### రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోగా అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గడా అధికారి ముత్యంరెడ్డి, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, డిపిఓ దేవకిదేవి, తహసీల్దార్ భవాని, ఎంపిడిఓ ప్రవీణ్, సర్పంచ్ లక్ష్మిరాములుగౌడ్, ఎంపిటిసి నరేందర్, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్, డ్రోన్ కెమెరా డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు నీలిమ, మౌన, శాంతి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, అంజి, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు మీదున్న ధ్యాస రైతులపై లేదు

**మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి**
**-ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం**

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్17 ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నిక మీద ఉన్న ధ్యాస సీఎం కేసీఆర్‌కు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలకు రైతులపై లేదని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి విమర్శించారు. మెదక్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవార అఖిలపక్షం నేతలు శశిధర్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో వరి కోతలు ఊపందుకున్నాయని, ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షాలతో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మక్కల కొనుగోలు కేంద్రాలు లేక రామాయంపేట, నిజాంపేట మండలాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం టీడీపీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అఫ్జల్ మాట్లాడుతూ పత్తి పంటను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ సురేందర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట రాజు, మాజీ ఏడుపాయల చైర్మన్ నర్సింలుగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ లింగం, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఏసురెడ్డి, మాజీ కౌన్సిలర్ మ్యాకల రవి, అఖిలపక్ష నేతలు దమ్ము యాదగిరి, ఏర్పుల విజయ్ కుమార్, అల్లుడు కృష్ణ, చెదల ఊషయ్య, కరీం, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నేతలు

# త్రిబుల్ ఆర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వం

**ప్రధాన రోడ్డుపై భూమి నిర్వాసితుల ధర్నా**
**మద్దుతు తెలిపిన కాంగ్రెస్ బిజెపి నాయకులు**

**నర్సాపూర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** బడా బాబుల భూముల కోసమే త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చారు... రెడ్డిపల్లి వద్ద రెండు గంటల పాటు ప్రధాన రోడ్డుపై భూనిర్వాసితుల ధర్నా రాస్తారోకో ధర్నా... మద్దుతు తెలిపిన కాంగ్రెస్, బిజెపి నాయకులు... తమ ప్రాణాలు పోయిన సరే రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం తమ భూములు ఇవ్వమని డిమాండ్ చేస్తూ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గేట్‌వద్ద మెదక్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై రెండు గంటలపాటు భారీ ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. వీరికి కాంగ్రెస్, బిజెపి నాయకులు మద్దుతు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ లు మాట్లాడుతూ రింగ్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని లేదా ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూమినె నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులు రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు పోతే వారి పోతే వారి బతుకులు ఎలా అన్ని ప్రశ్నించారు. బడా బాబుల భూములను కాపాడేందుకు అలైన్మెంట్‌ను మార్చారని అన్నారు. అలైన్మెంట్ మార్చడం వల్ల ఎంతోమంది పేద రైతుల భూములు రింగ్ రోడ్‌లో పోతున్నాయని వారు ఆవేధనవ్యక్తం చేశారు. ఈ ధర్నా, రాస్తారోకో వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి, ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఈవిషయం తెలుసుకున్న ఎస్ఐ గంగరాజు తన బలగాలతో సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళ నకారులకు ధర్నా విరమించాలని కోరారు. దీంతో ఆర్డీవో అక్కడికి వచ్చి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చేంతవరకు తాము కదిలేది లేదని మొండికేశారు. దీంతో ఎస్ఐ గంగరాజు స్థానిక తాసిల్దార్ సంఘన స్థలానికి ఫోన్‌చేసి పిలిపిం చారు. పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తాహసిల్దార్ ఆంజనేయులు రైతులకు హామీ ఇవ్వడంతో ధర్నా, రాస్తారోకో విరమించారు. రెడ్డిపల్లి ఉప సర్పంచ్ అశోక్ గౌడ్, మాజీ సర్పంచ్ భరత్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం నాయ కులు శివప్రసాద్ గౌడ్, మాణిక్యం గౌడ్, ఏర్ల నిరంజన్ గౌడ్, సత్యనారాయణ, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట కాజిపేట్ తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



ధర్నా రాస్తారో చేస్తున్న రెడ్డిపల్లి గ్రామస్థులు

# షీ-టీం కార్యాలయం ప్రారంభం

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న వేదింపులను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన షీ-టీంల కోసం జిల్లా ఎస్పీ యం రమణకుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని పోలీసు ఠాణా కార్యాల యంలో సోమవారం షీ-టీం కార్యాలయాన్ని డిఎస్‌పి రఘు ప్రారంభిం చించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు వేదిం పుకలు గురైతే వెంటనే 100, 7901148923కి డయల్ చేయాలని సూచిం చారు. ఈవ్ టీజింగ్, వేదింపులను అరికట్టేందుకే షీ-టీం కార్యాలయాన్ని ప్రారం భించామన్నారు. సమాజం ప్రశాంతంగా ఉండటమే పోలీసుల లక్ష్యమన్నారు. షీ-టీం కార్యాలయంలో ఒక ఎస్ఐ, ఒక మహిళా హెడ్‌కానిస్టేబుల్ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో టౌన్ సిఐ తోట భూపతి, ఎస్ఐలు శ్రీకాంత్, నర్సింలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిఎస్పీ రఘు



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను తక్షణమే పరిష్కారం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పట్ల సంబంధితశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సంబంధిత, రెండు పడకల గదులు, అసరా పెన్షన్లు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ 67 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్వో చెన్నయ్య, కలెక్టరేట్ ఎవో రెహమాన్, వివిధశాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భూ బాధితురాలికి న్యాయం

**అక్రమ పట్టా మార్పిడిని రద్దుచేసి**
**శివమ్మ పేరిట మార్చిన 27.34 ఎకరాలు**
**అక్రమాలను సహించబోము : కలెక్టర్**



భూ బాధితురాలు శివమ్మకు పట్టాపాస్‌బుక్‌ను అందజేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** అమాయకులైన రైతుల భూములను తప్పుడు ధృవ పత్రాలలో ఇతరుల పేరిట పట్టా మార్పిడికి పాల్పడటం లాంటి అక్రమాలు చేస్తే ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ అన్నారు. జిల్లాలో ఇటీవల రాయికోడ్ మండల నాగన్‌పల్లికి చెందిన పట్లోళ్ల శివమ్మ పేరిట సర్వే నెంబర్ 198లో గల 27.34 ఎకరాల భూమిని తాహసిల్దార్ ఆమె బ్రతికుండగానే ఇతరుల పేరిట పట్టా మార్పిడి చేసినట్లు సెప్టెంబర్ 21న శివమ్మ తమ దృష్టికి తీసుకువచ్చిందన్నారు. ఇట్టి విషయమై వెంటనే విచారణ చేయగా, సంబంధితురాలి భూమి పౌతి నిబంధనలకు విరుద్ధంగా పౌతిచేసినట్లు రుజువైందన్నారు. అట్టి నివేదికను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. పూర్తి నివేదిక మేరకు ప్రభుత్వం శివమ్మ భూమిని ఆమె పేరుట చేయడానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ మేరకు ఇతరుల పేరిట పట్టా మార్పడి చేసిన భూమిని రద్దు చేసి తిరిగి పట్లోళ్ల శివమ్మ పేరిట పట్టా చేసినట్లు కలెక్టర్ వివరించారు. అక్రమాలకు పాల్పడిన శేరి అంజమ్మ, ఆమె కుమారుల పై చట్ట ప్రకారం చర్యలు చేపట్టామని, ఇప్పటికే సంబంధిత తాహసిల్దారును సస్పెండ్ చేశామని, సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

### చెప్పలేనంత ఆనందంగా ఉంది : పట్లోళ్ల శివమ్మ

పోయిందనుకున్న నా భూమిని నా పేరిట మార్చిన ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్‌కు రుణపడి ఉంటానని పట్లోళ్ల శివమ్మ పేర్కొన్నారు. భూమి ఇతరులు పేరిట మారిన విషయాన్ని జిల్లా కలెక్టర్ శరత్ కు తెలుపగానే వెంటనే స్పందించి వెంట వెంటనే అన్ని విధాల చర్యలు తీసుకున్నారు. రోజు నిద్ర కూడా పోవడం లేదని, ఏమైంతుందో ఏమోనని భయపడుతున్న నాకు, నా కుటుంబానికి దిగులుపెట్టుకోవద్దని, నీ భూమి ఎక్కడికి పోదు. నీ భూమిని కాపాడే బాధ్యత నాదని కలెక్టర్ బరోసా నిచ్చారని, అన్న మాట ప్రకారం నా భూమి నా పేరిట మార్చారు. ఇంత తొందరగా (ఒక నెలలోపే) పోయిందని అనుకున్న భూమి నాది నాకు వచ్చేలా, మా వెన్నంటి ఉండి ధైర్యాన్ని అందించిన అధికారులకు అందరికీ ఆమె హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

### చెరువులో చేపపిల్లలను వదిలిన మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ రాయరావు చెరువులో సోమవారం నాడు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ చేతులమీదుగా చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపపిల్లల పెంపకంతో మత్స్యకారుల అభివృద్ధిచెందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం మత్స్యకారుల కోసం అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాపగారి పెద్ద రమేశ్ గౌడ్, నాల్గవవార్డు కౌన్సిలర్ ఎరుకల యాదగిరి, మత్స్యకారుల అధ్యక్షులు నాగభూషణం, ఉపాధ్యక్షులు కొండి కుమార్, కార్యదర్శి దుద్దాల యాదగిరి, డైరెక్టర్లు సురేష్, జింకల మోహన్, క్యాషియర్ రుస్తుం పేట మల్లేశ్, సభ్యులు దుద్దాల సంతోష్, కొండి దుర్గేష్, కులకంటి పెద్ది రాజులు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేపపిల్లలను వదులుతున్న చైర్మన్ మురళి యాదవ్



కొత్తపల్లి చెరువులలో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎంపిపి

**రాయపోల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త :** మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్ అన్నారు. సోమవారం రాయపోల్, కొత్తపల్లి గ్రామాల్లోని చెరువులలో రాష్ట్ర ప్రభుత్వం, మత్స్యశాఖ అందిస్తున్న ఉచిత చేప పిల్లలను ఆమె మత్స్యశాఖ అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల జీవనోపాధి మెరుగుపరచడానికి ప్రభుత్వం అందిస్తున్న చేయూతను మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం కేసిఆర్‌కు కుల సంఘాల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాయపోల్ గ్రామ సర్పంచ్ మౌనిక రాజిరెడ్డి, మత్స్యశాఖ ఏడి మల్లేశం, కొత్తపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నామసాని రాజు, చందపురం సత్తయ్య, ముదిరాజ్ కుల సభ్యులు కిచ్చుగారి యాదయ్య, స్వామి, రాజారాం మల్లేశం, కనకయ్య పాల్గొన్నారు

## ఉత్తమ సేవ సర్పంచ్ నేషనల్ అవార్డుకు స్వామిగౌడ్ ఎంపిక



ఉత్తమ సేవసర్పంచ్ ఎన్నిక అహ్వానపత్రికను అందుకుంటున్న స్వామిగౌడ్

**కొమురవెల్లి, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రసూలాబాద్ గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్‌ను ఉత్తమ సేవ సర్పంచ్‌గా నేషనల్ అవార్డు 2022కు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ అవార్డు జాతీయ చైర్మన్ నల్ల రాధకృష్ణ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన అహ్వాన పత్రాన్ని హైదారాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత స్వామిగౌడ్ మాట్లాడుతూ ప్రతి యేటా స్వచ్ఛంద సంస్థలకు ఉత్తమ ప్రజాప్రతినిధులకు, కవులకు, ఉద్యమకారులకు, సంఘ సేవకులకు ఈ అవార్డు అందజేస్తారని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రజాసేవకుడిగా సామాజికకర్తగా సేవాలందిస్తున్నందుకు నన్ను ఈ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ అవార్డు రావడం ప్రజలకు సేవ చేసే బాధ్యత మరింత పెరిగిందన్నారు. నవంబరు 13న ఢిల్లీలో జరిగే అల్ ఇండియా బహుజన సాహిత్య నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఉత్తమ సేవ సర్పంచ్ జాతీయ పురస్కారం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బిఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్, కో-అర్డినేటర్ విష్ణు, సెలక్షన్ కమిటీ సభ్యులు ముక్కెర సంపత్‌కుమార్, సాంస్కృతిక సారధి గాయకుడు పిన్నింటి రత్నం పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన ..



తడిపొడి చెత్త వినియోగంపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ రజిత

**హుస్నాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రధానంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న పట్టణంలోని రెండవవార్డు ప్రజలకు సూచించారు. హానికరమైన చెత్తను వేరు చేయాలని చెబుతూ మురికికాలువల్లో చెత్తను వేయకుండా చూసుకోవాలని చెప్పారు. అలాగే ఇంట్లో చెత్తతో హోంకంపోస్టు ఎరువును కూడా తయారు చేసుకుని తమ ఇళ్ళలో మొక్కలకు వేసుకోవాలని ఆకుల రజితవెంకన్న వివరించారు.కార్యక్రమంలో రెండవవార్డు కౌన్సిలరు బోజు రమాదేవిరవితో పాటు మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 19న కల్లుగీత పారిశ్రామిక సమస్యలపై బహిరంగసభ



భారీ బహిరంగసభ పోస్టర్ ఆవిష్కరణ

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఈనెల 19న యాదాద్రి భువనగిరిలో నిర్వహిస్తున్న కల్లుగీత పారిశ్రామిక సమస్యలపై భారీ బహిరంగ సభను విజయవతం చేయాలని సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకాఎల్లమ్మదేవాలయ ప్రాంగణంలో పోస్టర్‌ను ఆవిష్కరించి కల్లుగీత సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పచ్చిమట్ల రవిందర్‌గౌడ్,కక్కెర్ల సత్యంగౌడ్,దాయపెల్లి కనకయ్య,బండి శంకర్,పచ్చిమట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## చీకోడు, రామక్కపేట శివారులో పులి పిల్లల సంచారం

**దుబ్బాక, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చీకోడు, రామక్కపేట శివారులో పులి పిల్లల సంచారిస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. చీకోడు గ్రామానికి చెందిన బొంగరం మచ్చేందర్ బావి వద్దకు వెళ్లేసరికి బావి బొందలో పులి పిల్లలు సయ్యాటలు అడుకోవడం చూసి భయంతో వెనుతిరిగాడు. ఈ విషయాన్ని చుట్టు పక్కల రైతులకు తెలియజేయడంతో హుటాహుటిన బావి వద్దకు వెళ్లారు. అతను అక్కడికి చేరుకునేసరికి పులి పిల్లలు కనబడడం లేదని తెలిపారు. దీంతో మచ్చేందర్ వ్యవసాయ బావి వద్దకు జనాలు తండోప తండాలుగా చేరుకున్నారు.

## ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

**ములుగు, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** ప్రధాని నరేంద్రమోడి ప్రవేశపెట్టిన పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సంవత్సరానికి రూ.6వేల చొప్పున నాలుగు నెలలకు ఒకసారి జమ చేయడం సంతోషకర విషయమని ములుగు మండల బిజెపి నాయకులు అన్నారు. చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో సోమవారం 11 గంటలకు పిఎం కిసాన్ నిధి నుండి కేంద్ర ప్రభుత్వం డబ్బులు విడుదల చేసిన సందర్భంగా ములుగు మండలం వంటిమామిడి రాజీవ్‌రహదారి చౌరస్తాలో బిజెపి మండల అధ్యక్షుడు పల్లె రమేష్ ఆధ్వర్యంలో నరేంద్రమోడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ జిల్లా ఉపా ధ్యక్షురాలు కట్ట భాగ్యలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి, బిజెవైఎం మండల ఉపాధ్యక్షుడు సాయికిరణ్, మండల నాయకులు రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నరేందర్‌రెడ్డి, బహిలంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

# చిన్నకోడూరు మార్కెట్ కమిటీ పాలక వర్గం నియామకం

### చైర్మన్‌గా వనితరవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కుంటయ్య

**సిద్దిపేట అర్బన్(చిన్నకోడూరు), అక్టోబర్ 17, ప్రభాతవార్త:**

చిన్నకోడూరు మండల మార్కెట్ కమిటీ పాలక వర్గం ఎట్టకేలకు కొలువుదీరనుంది. సోమవారం ప్రభుత్వం చిన్నకోడూరు మండల మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన పాలకవర్గం ఉత్తర్వులను రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాసుతో కలిసి నూతన చైర్మన్‌గా నియమితులైన కొండం వనిత రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ములకల కుంటయ్యలు అందుకున్నారు. కొంత కాలం నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదిరి చూసిన మార్కెట్ కమిటీ పాలక వర్గానికి తెరపడింది. త్వరలో మంత్రి హరీష్‌రావు సమక్షం లో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది.

**నూతన పాలకవర్గం**

చిన్నకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండల పరిధిలోని చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉన్నత విద్యావంతురాలు కొండం వనితరవీందర్ రెడ్డి నియామకమయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా ఇబ్రాహీంనగర్‌కు చెందిన ములకల కుంటయ్య నియమితులయ్యారు. సభ్యులుగా బంక పోచయ్య, సల్లోజు సృజన, పల్లె నర్సింహారెడ్డి, రాచకొండ లింగం, చింతల దత్తయ్య, దుంపలపల్లి మల్లేశం, కానుగుల దేవయ్య, జంగం బాలాకర్‌రెడ్డి, కుంబాల చంద్రశేఖర్, తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, బుచ్చెల్లి రమేష్, సుధాకర్‌లను నియామకమయ్యారు. అలాగే పిఎసిఎస్ చైర్మన్, సర్పంచ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటింగ్‌లు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు తనపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అప్పగించిన కొండం వనితరవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ములకల కుంటయ్యలు మంత్రి హరీష్‌రావుకు పదవి రావడానికి సహకరించిన జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, పార్టీ ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన ప్రభుత్వ ఉత్తర్వులను మంత్రి చేతుల మీదుగా అందుకుంటున్న దృశ్యం



కొండపోచమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న పాలకవర్గం

## ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

### -కొండపోచమ్మ ఆలయ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** శ్రీకొండపోచమ్మ అమ్మవారి దేవస్థానంవద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆలయ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తీగుల్‌నర్సాపూర్‌లో వెలసిన శ్రీ కొండపోచమ్మ ఆలయ పాలకవర్గ సమావేశం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ పరిసరాలలో వ్యాపారస్తులు, దుకాణదారులు, ప్రజలు చెత్తాచెదారం వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు.ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. తదనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గర్నెపల్లి రజితరమేష్, ఆలయ ధర్మకర్తలు చెట్టుపల్లి కనకారెడ్డి, డి.కనకయ్య, జానకిరాములు, మాధవరెడ్డి, కుమ్మరి కనకయ్య, రాంచంద్రారెడ్డి, ఆర్‌కె.శ్రీనివాస్, నిమ్మ రమేష్, కిషన్‌చారి, గర్నెపల్లి కొండయ్య, తలసాని శంకర్‌యాదవ్, గోలి సంతోష్, ముక్కెర గీత, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ మార్కెట్‌ను తనిఖీ చేసిన ఆహారభద్రత జిల్లా అధికారి

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని హైదారాబాద్ రోడ్డులో గల రత్నదీప్ సూపర్ మార్కెట్‌ను జిల్లా ఆహారభద్రత అధికారి చేపూరి కృష్ణమూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణానికి చెందిన మహేందర్‌రెడ్డి అనే వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించినట్లు అయన తెలిపారు. ఫాలుద సీడ్స్ సీల్డ్ ప్యాకెట్‌లో చిన్న పురుగు ఉన్నదని ఫిర్యాదు చేయడంతో శాంపిల్లను సేకరించి రాష్ట్ర అహార ప్రయోగశాల నాచారంకు పరీక్షల నిమిత్తం పంపించినట్లు తెలిపారు. ప్రయోగశాల నివేదిక ప్రకారం సంబంధిత రత్నదీప్ సూపర్ మార్కెట్‌పై తగు చర్యలు తీసుకుంటమన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా కల్తీ అహార పదార్థాలు అమ్మితే సహించేది లేదన్నారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన

**గజ్వేల్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు కౌన్సిలర్ పంబాల అర్చనశివకుమార్ పేర్కొన్నారు. సోమవారం 4వ వార్డులో తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ చెత్త బండిలో వేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌పి మసూదున్నీసాతో పాటు 4వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**మెదక్ అర్బన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట మండలం చండీ గ్రామానికి చెందిన కిష్టయ్య తనకు చండీ గ్రామంలో 1-20 గుంటల భూమి ఉందని, అట్టి భూమిలో నుండి తన కుమారులకు చెరి 0-7 1/2 గుంట భూమిని ఇచ్చానని, మిగిలిన భూమి తన పేరున ఉన్నదని, కొంత భూమిని తన ఇద్దరు కూతుళ్లకు జీవనోపాధి కోసం ఇవ్వాలనుకుంటున్నానని, తన కొడుకులు నా పట్టా పాస్‌బుక్ తీసుకొని అట్టి భూమిని నా కుమార్తెలకు ఇస్తే, చంపేస్తామని బెదిరిస్తున్నారని, ఆహారం కూడా ఇవ్వడం లేదని మా బాగోగులు చూడటం లేదని, కావున తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్ట ప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయంచేయాలని తూప్రాన్ డీఎస్పీని సూచించారు. అలాగే పాపన్నపేట గ్రామానికి చెందిన గొట్ట మీన తన భర్త తేదీ 24-09-2022 నాడు చనిపోయాడని, తన భర్త మరణంపై తమ గ్రామానికి చెందిన కొందరి వ్యక్తులపై అనుమానం కలదని, అట్టి వారిని విచారించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్ట ప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని మెదక్ డీఎస్పీ సూచించారు. సోమవారం జిల్లా నలుమూలల నుండి పలు ఫిర్యాదిదారులు రావడం జరిగింది.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



జగదేవ్‌పూర్‌లో రఘుచిత్రం షూటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

## కనువిప్పు లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** ప్రజలు మూఢనమ్మకాలను నమ్ముతూ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అలాంటి మూఢనమ్మకాలను విడనాడేందుకు కనువిప్పు లఘుచిత్రాన్ని ఎస్ఐ కృష్ణమూర్తి సహకారంతో పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా దర్శకుడు బీరప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర చాలా కీలకమని గ్రామాల్లో ఇంకా మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయని, శాస్త్ర విజ్ఞానం ఎంత పెరిగినా ప్రజల్లో అక్కడక్కడ మూఢనమ్మకాలు విశ్వసిస్తున్నారని అన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కనువిప్పు లఘుచిత్రం దర్శకుడు బీరప్ప ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు దామోదర్, రాంచంద్రం, నర్సింలు, రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని

## ముంపు గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మల్లన్నసాగర్ ముంపు గ్రామస్తుల విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన బాధితులు గజ్వేల్ మండలం సంగాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివాసముటున్నారు. కాలనీలో ప్రభుత్వ పాఠశాల నిర్మించినప్పటీకి సరైన వసతులు లేవని దీనికి తోడు ఉపాధ్యాయుల కొరత ఉందని నిరసన వ్యక్తంచేశారు. పాఠశాలలో 350 మంది విద్యార్థులుంటే సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడాల్సివస్తుందని పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. వెంటనే పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

### ఏఐసిసి అధ్యక్ష ఎన్నిక కోసం ఓటు హక్కును వినియోగించుకున్న శ్రీనివాస్‌రెడ్డి

**తొగుట, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ఏఐసీసీ అధ్యక్ష పదవి కోసం సోమవారం హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన పోలింగ్‌లో దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి, టిపిసిసి సభ్యులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎవరూ ఎన్నికైనా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

## కరాటేలో దుద్దెడ విద్యార్థుల ప్రతిభ

**కొండపాక, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ఇండోర్ స్టేడియం రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్-22 పోటీలో అదివారం నిర్వహించారు. ఈ పోటీలో దుద్దెడ విద్యార్థులు గజ్వేల్ కిషోర్ కటాస్‌లో గోల్డ్ మెడల్, విద్యాచరణ్ స్పైరింగ్ సిల్వర్, మెడల్,కల్పనా స్పైరింగ్‌లో, కటాస్ బ్రౌన్ మెడల్,రక్షన్ స్పైరింగ్ బ్రౌన్ మెడల్ సాధించారు. సర్పంచ్ అరెపల్లి మహదేవ్‌గౌడ్ గ్రామ పంచాయతీ అవరణలో కరాటే పోటీల్లో గెలుపొందిన దుద్దెడగ్రామ విద్యార్థులను కరాటే మాస్టర్ నర్సింలును అభినందించి సన్మానించారు. అనంతరం అయన మాట్లాడుతూ క్రీడలు, మానసికంగా అరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయన్నారు. అత్మరక్షణకు కరాటే ఒక అయుధంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దొడ్ల రమేష్, చిలుముల శ్రీరాములు, నర్సింలు, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ మహదేవ్

# టీబీ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం ఇవ్వనున్న మంత్రి హరీష్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

క్షయ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు అండగా నిలిచి.. ఆత్మీయ భరోసా కల్పించడానికి ముందుకొచ్చారు. మానవతా దృక్పథంతో ఆలోచించి వ్యాధి తీవ్రతను నియంత్రించడంతో పాటు ఆరోగ్యం స్థిరంగా ఉండేలా మంచి నిర్ణయం తీసుకున్నారు. క్షయవ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు 4 రకాల పోషకాహారాలతో కూడిన న్యూట్రిషన్ కిట్‌ను సొంత ఖర్చులతో ఇవ్వడానికి శ్రీకారం చుట్టారు. సిద్దిపేట నియోజకవర్గంలోని 265 మంది వ్యాధిగ్రస్తులకు 6 నెలల పాటు ప్రతి నెల వారి ఇంటికిచేరేలా నాణ్యతకలిగిన న్యూట్రిషన్ కిట్‌ను ఆత్మీయ కానుకగా అందివ్వనున్నారు.

**బాధితులకు మానసిక ధైర్యం టిహెచ్‌ఆర్ న్యూట్రిషన్ కిట్**

సంపాదన కోల్పోవడం..కొన్నినెలలపాటు వ్యాధితో బాధపడడంవల్ల రోగుల్లో ఆత్మవిశ్వాసం పోవడంతో పాటు రోగ నిరోధకశక్తి తగ్గుతుంది. ఈ క్రమంలో మంత్రి టీబీ రోగుల ఆరోగ్యానికి అండగా నిలవనున్నారు. నియోజకవర్గంలో 256 మంది రోగుల కోసం కిట్లు పంపిణీ చేయ డానికి సిద్ధం చేశారు. 3 కిలలో బియ్యం, కిలో పప్పు, 300 గ్రామాల ఆవు నెయ్యి, 30 కోడి గుడ్ల కిట్ ఇవ్వనున్నారు. టీబీ రోగులను పట్టించు కొని ఈ రోజుల్లో మంత్రి హరీష్‌రావు వారికి మనో ధైర్యాన్ని ఇవ్వనున్నారు.




క్షయవ్యాధిగ్రస్తులకు అందివ్వనున్న టిహెచ్‌అర్ న్యూట్రిషన్ కిట్

**మనోధైర్యమే రోగానికి మందు**

టీబీ రోగులు పడేబాధ అంత ఇంతకాదు. వారికి వ్యాధి వచ్చినప్పటీ నుంచి రోజురోజు అత్మవిశ్వాసం పోయి రోగ నిరోధక శక్తి తగ్గి కుమిలిపోతుంటారు. ఎంతటి వ్యాధినైనా మనోధైర్యంతో నయం చేసుకోవచ్చు. రోగుల్లో అత్మ విశ్వాసం కల్పిస్తే అంతకు మించిన వైద్యం మరోకటి ఉందని భావించిన మంత్రి హరీష్‌రావు తన నియోజకవర్గంలో కిట్లు ఇవ్వడానికి శ్రీకారం చుట్టారు.



టూ వీలర్ మెకానిక్‌ల రాష్ట్ర సొసైటీ నూతన కార్యవర్గం

## మెకానిక్‌లకు మెకానిక్ బంధు అమలు చేయాలి

### టి.రాష్ట్ర నూతన అధ్యక్షుడు వెంకటరెడ్డి

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ టూ వీలర్ మెకానిక్ అండ్ వర్కింగ్ సొసైటీ రాష్ట్ర కమిటీని సిద్దిపేటలో అదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. కమిటీ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తడిసిన వెంకట్‌రెడ్డి(సిద్దిపేట), ప్రధాన కార్యదర్శిగా జోగి అశోక్‌కుమార్ (హైదారాబాద్), కోశాధికారిగా వీరన్నగారి శ్రీనివాస్‌రెడ్డి(గజ్వేల్), ఉపాధ్యక్షులుగా ఎ.రమేష్(మహబూబ్‌నగర్), ఎన్.రమేష్(జయశంకర్‌భూపలపల్లి), ఎం.డి.గౌస్(మంచిర్యాల్), జి.బాలరాజ్(మెదక్), ఎస్.కె.మస్తాన్ (ఖమ్మం), సహాయ కార్యదర్శులుగా ఎన్.నర్సింహా(నారాయణపేట), పి.సత్యం(వనపర్తి) ఎం.డి. మోహినొద్దీన్(సిద్దిపేట), ముఖ్య సలహాదారులుగా బి.మల్లేశం (సిద్దిపేట), టి.విద్యాసాగర్(సిద్దిపేట)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టి.రాష్ట్ర నూతన అధ్యక్షులు తడిసిన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టూ వీలర్ మెకానిక్, వర్కర్స్ సమస్యల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మెకానిక్‌లను కార్మికులుగా గుర్తించాలన్నారు. మెకానిక్‌లకు మెకానిక్ బంధు పథకం అమలుచేయడంతోపాటు బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాని కోరారు. మెకానిక్‌లకు ప్రభుత్వ పథకాలను వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని భవానందపూర్ గ్రామానికి చెందిన చిట్టమైన రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వారితో పాటు స్థానిక సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు నర్సింలు, కనకయ్య, యాదగిరి, భవానందపూర్, పాములపర్తి టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లేశ్, మహేష్, మండల ముదిరాజ్ యువజన విభాగం అధ్యక్షుడు రాజు, నాయకులు స్వామి, కనకరాజు, ప్రశాంత్, పాండు, మొగిలి, మహేష్, ముత్యాలు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగం

**మర్కుక్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ గడ్డం ప్రసాద్ తెలిపారు. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన శంకర్‌సింగ్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంత్రి హరీశ్‌రావు సహకారంతో మంజూరైన రూ.60వేల చెక్కును సోమవారం లబ్దిదారునికి సర్పంచ్ గడ్డం ప్రసాద్, ఉపసర్పంచ్ జగదీష్‌సింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం హయాం లో నిరుపేదలకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్‌సింగ్ ఉన్నారు.

## వంటేరు నారాయణరెడ్డి మృతి బాధాకరం : ఎంపి

**గజ్వేల్, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన వంటేరు నారాయణరెడ్డి అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధి క్యాసారం గ్రామంలో నారాయణరెడ్డి స్వగృహానికి వెళ్ళి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలకంగా పనిచేసిన వారిలో నారాయణరెడ్డి ఒకరు అని అన్నారు. అనంతరం టిఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిండ్ల నాగు సోదరుడు మామిండ్ల బాబు మృతి చెందగా వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బాబు కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కౌన్సిలర్ బాలమణిశ్రీనివాస్‌రెడ్డి, బబ్బూరి రజితగౌడ్, తలకొక్కుల దుర్గాప్రసాద్, బొగ్గుల చందు, ఉమర్, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యూత్ అధ్యక్షుడు స్వామిచారి, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప దయాకర్, రాయపోల్ సర్పంచ్ రాజిరెడ్డి, బయ్యారం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, దిలాల్‌పూర్ సర్పంచ్ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడిగా చెన్నకేశవరెడ్డిని గెలిపించండి

**గజ్వేల్, అక్టోబర్ 17(ప్రభాతవార్త):** హైద్రాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల సందర్భంగా గజ్వేల్ మండలంలో పలు పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలల్లో ఉపాధ్యాయుల, అధ్యాపకుల ఓటు నమోదు కార్యక్రమాన్ని పిఆర్‌టియు మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల శాసనమండలి అభ్యర్థిగా గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను తీర్చే ఏకైక సంఘం పిఆర్‌టియు అన్నారు. త్వరలోనే పదోన్నతులతో కూడిన బదిలీలు, 317 సమస్యలను పరిష్కరించేవిధంగా రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి లింగం,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, హన్మంతరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## తల్లి చెంతకు చేరిన తప్పిపోయిన బాలుడు

**హుస్నాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త :**

పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంతంలో మూడేళ్ళ బాలుడు తప్పిపోయి తాము వచ్చిన ఇళ్ళు తెలియక అక్కడి వీధుల్లో తిరుగుతుండగా గమనించిన కొందరు 100డయల్‌చేసి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడిని చేరదీసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్ళి విచారణ జరపారు.ఈ మూడేళ్ళ బాలుడు వేలేరు మండలం కట్కూర్ గ్రామానికి చెందిన వంతడ్పుల సుమలత,కుమార్‌ల కుమారుడని తెలువగా వారిని పిలిచి తప్పిపోయిన మూడేళ్ళ బాలుడని హుస్నాబాద్ ఎస్ఐ సజ్జనపు శ్రీధర్ వారికి అందించారు.బాలుడిని చేరదీసి పోలీస్‌స్టేషన్‌కు తీసువచ్చిన హెడ్‌కానిస్టేబుల్ మొగిలినాయక్,సంపత్‌లను ఎస్ఐ శ్రీధర్ అభినందిచారు.



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

## ఆర్టీసీ బస్‌ను ఢీకొన్న బైక్...

### ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

**హుస్నాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పందిల్ల వాగు సమీపంలోని శ్రీరేణుకాఎల్లమ్మ దేవాలయం దగ్గర సోమవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసి బస్‌ను హీరోహోండా వాహనం ఢీకొని వాహనంపై ప్రయాణిస్తున్న ముప్పు అశోక్ (37) హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లికి చెందిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి ముప్పు వీరస్వామి తలకు తీవ్ర గాయాలై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా అతనిని హుటాహుటిన అసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.ఈ సంఘటనపై హుస్నాబాద్ ఎస్సై సజ్జనపు శ్రీదర్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తూ యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తెరాస నాయకులు

## మునుగోడు సిర్గాపూర్ నాయకుల ప్రచారం

**సిర్గాపూర్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** మునుగోడు ఎన్నికల ప్రచారంలో సిర్గాపూర్ మండల తెరాస నాయకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం సిర్గాపూర్ మండల తెరాస పార్టీ అధ్యక్షులు సంజీవరావు ఆధ్వర్యంలో తెరాస నాయకులు మునుగోడులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. తెరాస పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు కోరారు. ప్రజలంతా తెరాస పార్టీవైపే ప్రజలు అనుకూలంగా ఉన్నారని ఆయన అన్నారు. అనంతరం ఆ యా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఓ ఇంటి వద్ద చెట్టు కింద విశ్రాంతి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు తదితరులు ఉన్నారు.

### కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక సహాయం

**జిన్నారం, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బోల్లారం మున్సిపల్ పరిధిలోని ఐడిఏ బస్తీకి వలస వచ్చి జీవనం సాగిస్తున్న శ్రీకాకుళం వాసులకు కౌన్సిలర్ రాధా పరశురాం ఆర్థిక సహాయం అందచేశారు. ఐడిఏ బస్తీలో నివాసం ఉంటున్న రాజు ఇటీవల మృతి చెందాడు. రాజు కుటుంబం నిరుపేదలు కావడంతో కౌన్సిలర్ రాధా పరశురాం స్పందించి తన వంతుగా 5వేల నగదును కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌రెడ్డి, రాము, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం



చౌటుప్పల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడు శాసన సభ ఉప ఎన్నికలను పురస్కరించుకుని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 1, 13వ వార్డులలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అన్నా బాగున్నావా రైతు బంధు అందుతోందా, వదినా ఎలాగున్నావ్, పెన్షన్ ఒస్తున్నదా, అరే తమ్మీ వికలాంగ పెన్షన్ ఒస్తున్నదా అంటూ గ్రామస్థుడిలా పలుకరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు సూచిస్తున్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ బంగారు తెలంగాణ కోసం టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని శాసన సభ మెట్టు ఎక్కించాలని ప్రజలకు వినతి చేస్తున్నారు. టిఆర్ఎస్‌కు పట్టం కడితే కలిగే ప్రయోజనాలపై ఎమ్మెల్యే ప్రజలకు వివరిస్తున్నారు.

## పాఠశాలను సందర్శించిన అధికారులు

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 17,(ప్రభాతవార్త):**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని దామరిగిద్దతాండలో గల ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల అధికారులు సందర్శించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు విధులకు సరిగ్గా హాజరు కాకపోవడం వల్లన విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్లిపోయారు. దీంతో పాఠశాలకు ఉపాధ్యాయురాలు రావడం లేదని తాండ వాసులు తెలిపారు. ఈ మేరకు మండల ఎంపీడీఓ మహేష్‌బాబు, ఎంఈఓ కిష్టారెడ్డి, పెద్ద ఎల్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డిలు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తాండా వాసులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. తండాలోని పిల్లలను పాఠశాలకు పంపించాలని అధికారులు తాండ వాసులకు సూచించారు. ఉపాధ్యాయురాలు వస్తే తమ పిల్లలను బడికి పంపిస్తామని తెలిపారు. ఇప్పటి నుంచి ఉపాధ్యాయురాలు బడికి వస్తుందని అధికారులు తెలిపారు.

## ఎఫ్ఆర్‌సి ఆధ్వర్యంలో పోడు భూముల సర్వే

**చౌడాపూర్ అక్టోబర్17,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని మక్త వెంకటాపూర్ గ్రామంలో పోడు భూముల హక్కులు,సమస్యలపై ఏర్పాటైన ఎఫ్ఆర్సి కమిటీ ఆధ్వర్యంలో రైతులతో సభ నిర్వహించి,పోడు భూములు సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు.చౌడాపూర్ మండల తహసీల్దార్ అశోక్ కుమార్ మాట్లాడుతూ...పోడు భూముల హక్కులకై దరఖాస్తు చేసుకున్న భూములను సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిఐ మరియు అటవీ శాఖ అధికారి ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాందాస్ నాయక్,సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిఐ శివ కుమార్, ఎంపిడివో నాగమణి,ఎంపివో కరీముద్దీన్ ,గ్రామ సర్పంచ్ అనిత, ఎంపిటిసి సత్యమ్మ,ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ జమీరు ద్దీన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్,పంచాయతీ కార్య దర్శి మహేశ్వర్ రెడ్డి, నాయకులు శంకర్,వెంకట్,ఎఫ్ఆర్సి కమిటీ సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

## కోటమైసమ్మ ఆలయానికి లక్షా21వేల విరాళం

**షాద్‌నగర్, అక్టోబర్ 17, (ప్రభాతవార్త) :**

దినదినాభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్ పట్టణంలోని కోటమైసమ్మ ఆలయా పునర్నిర్మాణానికి భక్తులు తమ విరాళాలను అందజేస్తున్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ యువనాయకుడు మురళీమోహన్ రూ.లక్షా21వేల విరాళం ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుడికి, బడికి విరాళాలు అందజేయడం మన అదృష్టమని అలాంటి అవకాశాలను ఎవరూ వదులుకోవద్దని, ప్రతి ఒక్కరు తమకు చేతనైనాంత సహాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దినదినాభివృద్ధి చెంతున్న కోటమైసమ్మ ఆలయానికి తన వంతు సహాయం కొంత విరాళం అందజేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు విరాళం అందజేసిన మురళీమోహన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అతని కుటుంబ సభ్యులకు ఆ అమ్మవారి ఆశీస్సులు ఎప్పుడు ఉండాలని వారు ఆకాక్షించారు. ఆలయన అభివృద్ధికమిటీ సభ్యులు బుచ్చిబాబు, జర్నలిస్టు కేపీ, శుక్రవర్ధన్‌రెడ్డి, ప్రదీప్, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఎంఎస్‌పి బలోపేతానికి కృషి చేయాలి

**-నియోజకవర్గ ఇంచార్జీ ఆనంద్ కుమార్**

**యాలాల అక్టోబరు 17,ప్రభాతవార్త :**

సోమవారం యాలాల మండల కేంద్రంలో మహాజన సోషలిస్ట్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితిగా ఆ పార్టీ తాండూరు నియోజక వర్గ ఇంచార్జీ పెద్దోళ్ల ఆనంద్‌కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగ యాలాల మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. యాలాల మండల అధ్యక్షులుగా గోరెపల్లి పసుల వెంకటయ్యను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.



వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ శరత్

## రైతు సంక్షేమ పథకాలను రైతులకు చేరవేసేలా కృషి చేయాలి : కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి యాక్షన్ ప్లాన్, రైతుభీమా క్లైమ్‌లు, పంట రుణాలు, రైతు శిక్షణలు తదితర అంశాలపై సమీక్షించారు. రైతుభీమాకు సంబంధించి, భీమా డబ్బుల బాధిత కుటుంబీకులకు త్వరితగతిన అందేలా ఆయా క్లైమ్స్ సెటిల్మెంట్ వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. లేదా ఐదు రోజుల్లోపు రైతుబీమా క్లైమ్ అప్లోడ్ చేయాలని సూచించారు. 2022-23 యాసంగి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. యాసంగి పంట రుణాలు రైతులకు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడి నరసింహారావు, విద్యాశాఖ అధికారిని సునీత, ఏడిఏలు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించని కార్యదర్శిని బదిలీ చేయాలి

**-ఎంపిడిఓకు సిఐటియు నాయకుల వినతి**



ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

**పటాన్‌చెరువు, అక్టోబరు 17, ప్రభాతవార్త:** సమస్యలను పరిష్కరించని పంచాయితీ కార్యదర్శిని బదిలీ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం పటాన్‌చెరువు ఎంపిడిఓ బన్సీలాల్‌కు మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం అందచేసిన సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ షోకాజ్ నోటీసులు అందుకున్న కార్యదర్శికి పారిశ్రామిక వాడలో తిరగి ఎలా పోస్టింగు ఇస్తారని ప్రశ్నించారు. మండలంలోని రుద్రారం గ్రామానికి బదిలీపై వచ్చిన పంచాయితీ కార్యదర్శి పనితీరు బాగాలేదని, అందుకు వెంటనే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంద్రకరణ్ మండలంలో విధులు నిర్వహిస్తున్న తరుణంలో పనితీరు సక్రమంగా చేయకపోవడంతో ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారని, ఇంద్రకరణ్ మండలానికి కూతవేటు దూరంలో ఉన్న రుద్రారం మేజర్ గ్రామ పంచాయితీకి ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. రుద్రారంకు నియమించిన పంచాయితీ కార్యదర్శిని ఇక్కడి నుంచి దూర ప్రాంతానికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

## ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభించాలి



మండల పరిషత్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వడ్డి గ్రామ యువకులు

**న్యాల్‌కల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని వడ్డి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం భవానాన్ని నిర్మించి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో గ్రామ యువకులు సిరననకు దిగారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రామ యువకులు ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయంలో సూపరిండెంట్ కవ్‌లాస్ రాజశేఖర్‌కు వనితి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు ఆనంద్ ఈశ్వర్, ఉమేష్ యాదవ్, విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ గ్రామంలో ఉప కేంద్రం ప్రారంభించకపోవడంతో రోగులు రోధన పడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఆనారోగ్యానికి గురైతే న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడం, గ్రామానికి దగ్గరలో గల కర్ణాటకకు వెళ్లి చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందుల అడ్డు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప కేంద్రం భవన నిర్మాణం పనులు పూర్తయినందున భవనాన్ని ప్రారంభించి అవసరమై వైద్య సిబ్బందిని నియమిస్తే గ్రామ ప్రజలకు సౌకర్య వంతంగా ఉంటుందని గుర్తు చేశారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లేలా రోడ్డు సౌకర్యం కల్పించాలని, మంజూరైన నిధులతో వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు పూర్తి చేయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు విజయ్‌కుమార్, అజయ్‌కుమార్, మోసిన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ జాతర పనులను పరిశీలించిన సర్పంచ్

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** ఆరుట్లలో ఈ నెల 8వ తెదీ నుండి 23వ తెదీ వరకు జరగబోయే బుగ్గరామలింగేవ్వర జాతర పనుల ను సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి సోమవవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో అమవాస్య నుండి పౌర్ణమి వరకు జరిగే ఈ జాతర ఎంతో ప్రాముఖ్యత కలిగిందన్నారు.ఈ సంవత్సరం వర్షాలు బాగా కురవడంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని దీంతో ప్రజలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆశాబావం వ్యక్తం చేశారు. అందుకు అనుగూనంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాండాల జంగయ్య, కార్యదర్శి వెంకటేశం,వార్డు సభ్యులు గాలమ్మ,మోహన్ రెడ్డి, వెంకటేష్,మల్లేష్,భాష తదితరులున్నారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై టీఎస్‌యూటీఎఫ్ అవగాహన

**కొడంగల్,అక్టోబర్ 17ప్రభాతవార్త**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అద్వర్యంలో కొడంగల్ మండలంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బందెప్ప అద్వర్యంలో మండలంలోని పెద్దనందిగామ, హస్నాబాద్,పర్సాపూర్,హుస్సేన్‌పూర్,గుండ్లపల్లి తదితర గ్రామాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంభందించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ముత్యప్ప,బసప్ప, అశోక్,శ్రీనివాస్,అంజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తక్కెళ్లపల్లి గ్రామం నుండి టిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు

**యాచారం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని తక్కెళ్లపల్లి గ్రామానికి చెందిన 120 మంది కాంగ్రెస్, బిజెపి నాయకులు, యువకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను చూసి టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచేందుకు సీనియర్ నాయకులు తల్లారి మల్లేష్, కంబాలపల్లి రేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సమితిలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్యులు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ యూత్ అధ్యక్షుడు జిట్టే సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారడిపల్లి వెంకట్‌రెడ్డి, శీలం ప్రశాంత్‌రెడ్డి, కంటేకర్ యాదయ్య, దుంపల విష్ణు, ఎస్ గణేష్, జిట్టే యాదయ్య, వివిధ పార్టీలకు చెందిన యువకులు పట్నం శ్రీకాంత్, కాశమళ్ల అనిల్ తదితరులు చేరారు.



సభ్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

## సాదాసీదాగా మండల సమావేశం

**సంగారెడ్డి, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** హత్నూర మండల సర్వసభ్య సమావేశం సోమవారం హత్నూరలో జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ వి నర్సింలు, జెడ్పిటీసీ ఆంజనేయులు, ఎంపిడివో శారదాదేవి, మండల ఉపాధ్యక్షులు పందు గలక్ష్మిరవికుమార్, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎజెండా అంశాలంలోని పంచాయతీరాజ్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఉపాధిహామీ పథకం, ఐకెపి, గ్రామీణాభివృద్ధిశాఖ, ఎక్సైజ్, వసతిగృహాలు, కస్తూర్బా పాఠశాల, మహిళా శిశుసంక్షేమశాఖ, వ్యవసాయ, విద్యుత్‌శాఖల అంశాలపై చర్చజరగగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానం ఇచ్చారు. ఎంపీటీసీలలో 50 శాతంమంది మాత్రమే హాజరుకాగా, 38 సర్పంచ్‌లకు గాను 10 మంది సర్పంచ్‌లు మాత్రమే హాజరైయ్యారు. సమావేశం హాల్‌లో ఖాళీ కుర్చీలు దర్శనిమిచ్చాయి.

## బంజారా ఎంప్లాయిస్ నూతన డివిజన్ కార్యవర్గం




నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం జహీరాబాద్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా తుకారాం చౌహాన్, ప్రధాన కార్యదర్శిగా హన్మంత్ పవార్, గౌరవ అధ్యక్షులుగా హీరు రాథోడ్, అసోసియేట్ అధ్యక్షులుగా నర్సింగ్ పవార్, లాలాసింగ్ చౌహాన్, ఉపాధ్యక్షులుగా కిషన్ చౌహాన్, శంకర్, జైరాం చౌహాన్, కిషన్ బానోథ్, విశ్వనాథ్ రాథోడ్, శానుబాయి, కార్యదర్శులుగా వేణుకుమార్, హరిసింగ్ చౌహాన్, రావి రాథోడ్, ఉమేశ్ చౌహాన్, రమేశ్ పవార్, కోశాధికారిగా దల్‌సింగ్ రాథోడ్, ప్రచార కార్యదర్శులుగా సుభాష్ జాదవ్, శంకర్ చౌహాన్, వెంకటేశం, సలహాదారరులుగా ధన్‌రాజన, కిషన్ పవార్, గోవింద్ చౌహాన్, గోపాల్ రాథోడ్‌లను ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకుల పి రంజింత్ నాయక్, ఆర్ నర్సింగ్, తులసీరామ్ రాథోడ్, అర్జున్ చౌహాన్, యం మంజ్యా నాయక్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

**కంగ్టి, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని నాగన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నాడు 6, 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్స్ బుక్ లు అందజేశారు. ఈ నోట్‌బుక్స్‌లను స్ఫూర్తి ఫౌండేషన్ సూపరింటెండెంట్ నాగమోహన్, సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ ఆచార్యల సహకారంతో ఈ నోట్‌బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలైన విద్యార్థులకు చేయూత నివ్వడం మా స్ఫూర్తి ఫౌండేషన్ ఎల్లవేళలో విద్యార్థులను ఆదుకోవడం జరుగుతుందన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగ్‌శెట్టి, ఉపాధ్యాయులు మౌనిక, ధరణి పాల్గొన్నారు.

## పశువులకు లంపి వైరస్ నివారణకై టీకాలు

**చౌడాపూర్ అక్టోబర్ 17,ప్రభాతవార్త :**

పశువులు,ఆవులకు లంపి స్కిన్ వైరస్ వ్యాపిస్తుండడంతో వైరస్ నివారణకు పశువులకు టీకాలను వేశారు.మండల కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పశువులకు మరియు ఆవులకు లంపి వైరస్ నివారణకై టీకాలను వేసి, పశువుల యజమానులకు లంపి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో చౌడాపూర్ ఎంపిటిసి శంకర్, వార్డు సభ్యులు అశోక్,రామకృష్ణ,రైతులు బాలయ్య, అంజయ్య, రమేష్,బోయిని నరేష్,ఆంజనేయులు శేఖర్ పాల్గొన్నారు.

## పెదవేడు సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

**షాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :**

గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండని సర్పంచ్ మాకొద్దని షాబాద్ మండలం పెదవేడు గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.... గ్రామ ప్రజలకు అందు బాటులో సర్పంచ్ ఉండడం లేదని, సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి కూడా అందు బాటులో ఉండడంలేదన్నారు. గ్రామసమస్యలపై ఎప్పుడు ఫోన్ చేసి స్పందించడంలేదని, గ్రామంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. కావున సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## ఏఐసీసీ ఎన్నికల్లో ఓటు వేసిన పిసిసిసి ప్రతినిధి ఎండీ.యూసుఫ్

**కొడంగల్,అక్టోబర్ 17ప్రభాతవార్త**

అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో కొడంగల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు,టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.సోమవారం హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించిన టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తలు, నాయకులకు ప్రాధాన్యత కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు.అలాగే పార్టీ నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## రైతులు నూనె, దినుసుల పంటలపై దృష్టి పెట్టాలి

**షాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :**

రైతులు నూనె దినుసుల పంటలపై దృష్టి పెట్టాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ ప్రసాద్‌లు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ముద్దెంగూడలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతీయ నూనెగింజల పరిశోధన స్థానం రాజేంద్రనగర్, హైదరాబాద్ వారి సహకారంతో ముద్దెంగూడలో ఏర్పాటు చేసిన సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లోని రైతులకు 150 మంది రైతులకు ఒక్కొక్కరికి ఒక ఎకరానికి కుసుమ యాజమాన్యంపై ముఖ్యంగా తెలుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాన్ని ప్రత్యేక్షంగా వీక్షించారు. ఈకార్యక్రమంలో మేనేజర్ రత్నాకర్, ఏవో వెంకటేశం, ఎస్బీఐ మేనేజర్ సరస్వతి, సర్పంచ్ జయమ్మసుదర్శన్, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, మాజీ సర్పంచ్ రాజు, గ్రామస్థులు లింగం, నర్సింలు, మల్లారెడ్డి, పాపిరెడ్డి, యాదిరెడ్డి, ముద్దెంగూడ, గొల్లూర్‌గూడ, బొబ్బిలిగామ, కొమరబండ, తిర్మలాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సీఐ, కమిషనర్లకు ఇడబ్ల్యుఎస్ నాయకుల సన్మానాలు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి.అశోక్‌రెడ్డిని సోమవారం ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కాలనీలో శాంతి భద్రతల పరిరక్షణ, సీసీ టీవి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సీఐ, నాయకులు చర్చించారు. అనంతరం ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.వేమనరెడ్డిని వారు సన్మానించి కాలనీలో సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో నాయకులు కలిశారు. ఈకార్యక్రమంలో ఇడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి పి.శశిధరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దంతాల వెంకటయ్య, నాయకులు .ఎట్టోజీ నాగభూషణం, బర్ల రాధాకృష్ణ, దంతూరి గోపాల్‌గౌడ్, నర్రా పోచయ్య, పిల్లి అశోక్, కె.సత్యనారాయణ, స్వామి వివేకానందయూత్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, సురేశ్ పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

**జోగిపేట,అక్టోబర్ 17,ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌ను ప్రారంభించిన సందర్భంగా సోమవారంనాడు జోగిపేటలో బిజెపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి బిజెపి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో పలు రకాల రైతులకు ఉపయోగకరమైన పథకాలను ప్రధానమంత్రి ప్రారంభించటం చాలా సంతోషకరమని వారు హర్షం వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు సాయి, శ్రీనివాస్, జగన్నాథం, నవీన్, గోవర్ధన్, ఈశ్వర్, శివచందర్, రాములు, మాణయ్య పాల్గొన్నారు.

**ఝరాసంగంలో..**



మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెవైఎం నాయకులు

**సంగారెడ్డి, అక్టోబరు 17, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే లక్ష్యం గా ప్రతి రైతు బ్యాంక్ ఖాతాలకు నేరుగా కిసాన్ సమ్మాన్ నిధి కింద 2వేల రూపాయలను జమ చేయిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోది చిత్ర పటానికి మండల కేంద్రమైన ఝరాసంగంలో సోమవారం బిజెవైఎం నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు మల్లికార్జున్‌పాటిల్, మండల మాజీ అధ్యక్షులు సంగమేశ్వర్ పాటిల్, జిఎస్ శ్రీనివాస్ పాటిల్, బిజెవైఎం మండల అధ్యక్షులు బంటు విశ్వనాథ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు అశోక్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు శ్రవణ్ సింగ్, సాయి గౌడ్, నాగరాజు పాటిల్, అంజిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**శంషాబాద్ అక్టోబర్17,ప్రభాతవార్త :**

ప్రధాన మంత్రి కిసాన్ సమాన్ యోజన పథకం కింద 12వ విడతలో 16వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి పెద్దతుప్పర గ్రామంలో రైతులు బిజెపి నాయకులు క్షీరాభిషేకం చేశారు.భారతీయ జనతా పార్టీ శంషాబాద్ మండల శాఖ అధ్యక్షుడు పెద్దతుప్పర సర్పంచ్ చిటికెల వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం రైతులు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాల్లి బిజెపి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చిటికెల వెంకటయ్య మాట్లాడుతూ... నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయిన తర్వాత రైతుల సంక్షేమం కోసం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొందించారని తెలిపారు.మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల అకౌంట్లో ప్రధానమంత్రి కిసాన్ సమాన్ యోజన పథకం నిధులను జమ చేయడం జరుగుతుందని వెంకటయ్య అన్నారు. నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ కోసం సరిహద్దులో జవాన్ల సంక్షేమం కోసం ఇటు దేశానికి వెన్నెముక అయిన రైతన్నల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అనితర సాధ్యం అన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి వెంకటేష్ చారి, పంచాయతీ సభ్యులు కృష్ణ గౌడ్, శౌ రెడ్డి, శంకరయ్య యాదవ్, బూత్ కమిటీ అధ్యక్షుడు కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం చేయండి

**-అదనపు కలెక్టర్ తిరుపతి రావుకు విరేష్ వినతి**



వినతి పత్రం అందజేస్నున్న దృశ్యం

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 17, ప్రభాతవార్త:**

నాగర్జునా సాగర్ ప్రదానరహదారి నుండి ఉప్పరిగూడ గ్రామానికి బ్రిడ్జిని నిర్మాంచాలని మాజి మండల అధ్యక్షులు బోసుపల్లి వీరేష్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌కు సోమవవారం వినతీ పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండి బారీగా నీరు ప్రవహించడంతో ఉప్పరిగూడ గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు.ప్రజల రాకపోకలు వీలుగా బ్రీడ్జి నిర్మాణం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మడుపు వెంకటేష్,ఓరుగంటి రాములు,బుట్టి మహేందర్(జూ.కేసిఆర్),కొంగరి శ్రీకాంత్,నరాల జంగయ్య,ప్రశాంత్ న్నారు.

## గోపిగడ్డ పంచాయతీని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తా

**షాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :**

గోపిగడ్డ పంచాయతీని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన వర్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ శివగౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు శంకర్‌రెడ్డిలు తదితరులు అవినాష్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. ఇటీవల కురిసన భారీ వర్షాల వల్ల మల్లారెడ్డిగూడ గ్రామం నుంచి గ్రామానికి వెళ్లేదారి గుంటల మయమైందని రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే గ్రామంలో అంతర్గత మురుగు కాల్వల నిర్మాణాలు, సీసీ రోడ్లు, పంచాయతీ భవనం అవసరమన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డుకు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. మరో రూ. 10లక్షల నిధులు అందరి సహకారంతో కేటాయిస్తా మన్నారు. గ్రామంలో యూజీడీల నిర్మాణాలకు రూ.5లక్షల నిధులు కేటాయించామన్నారు. మరోరూ.10లక్షల నిధులు అందరి సహకారంతో కేటాయిస్తామన్నారు. పొలారం మీదుగా బీటీ రోడ్డు నిర్మాణాలకు కృషి చేస్తామన్నారు.

### రక్తపోటుపై గ్లెన్‌మార్క్ అవగాహన సదస్సు

ఆవిష్కరణ ఆధారిత గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీ గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ప్రపంచ హృదయ మాసాన్ని సెప్టెంబర్ నెలలో నిర్వహించింది. దీనిలో భాగంగా 300 హైపర్‌టెన్షన్ ప్రజా అవగాహన ర్యాలీలు, 8వేలకు పైగా హైపర్‌టెన్షన్ స్క్రీనింగ్ క్యాంప్‌లను దేశవ్యాప్తంగా నిర్వహించింది. ఈ కంపెనీ దేశవ్యాపంగా 42 నగరాల్లో 8వేల మందికి పైగా డాక్టర్లు,10వేల మందికి పైగా హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌తో భాగస్వామ్యం చేసుకుని 10 కోట్ల మంది భారతీయకులను చేరుకోవడం లక్ష్యంగా చేసుకుంది. ఈ ర్యాలీలను దేశ్యాప్తంగా పలు హాస్పిటల్స్‌తో భాగస్వామ్యం చేసుకుని నిర్వహించింది.హైదరాబాద్, చెన్నైలలో 13 అవగాహన ర్యాలీలలను దీనిలో భాగంగా నిర్వహించినట్లు గ్లెన్‌మార్క్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ ఇండియా ఫార్ములేషన్స్ అలోక్ మాలిక్ అన్నారు.